
సాక్షి ఒడిశా

శనివారం । 16 । సెప్టెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.2,81,861

వెండి 7 గ్రాములు, 900 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



వీడని వాన..!

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు గంజాం, కొండమాల్ జిల్లాలను అతలాకుతలం చేస్తున్నాయి.

– IIలో▸



ప్రఫుల్ల సామంతరాయ్‌పై సీబీఐ విచారణ జరగాలి

సమాజ సేవకుడు ప్రఫుల్ల సామంతరాయ్ ఆస్తులపై సీబీఐ విచారణ జరపాలని పీసీసీ సాధారణ కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండ డిమాండ్ చేశారు.

– IIలో▸

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరణ



భగవన్ పూజారి

బరంపురం: గంజాం పోలీసు జిల్లా పరిధిలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రతినిధ్యం వహిస్తున్న బంజనగర్ పోలీసుస్టేషన్ కొత్త ఐఐసీ అధికారిగా భగవన్ పూజారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఆయన కొందమాల్ జిల్లా బల్లిగుడా పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారిగా విధులు నిర్వహించారు. గంజాం పోలీసుస్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు కాపాడనున్నట్లు తెలియజేశారు.

లైసెన్స్ లేని బాణాల దుకాణాలపై దాడులు



దుకాణాలు వద్ద ఉన్న పోలీసులు

బరంపురం: స్థానిక నీలకంఠేశ్వర్ బాణాల మార్కెట్‌లో లైసెన్స్ లేకుండా బాణాలు విక్రయిస్తున్న దుకాణాలపై పోలీసులు దాడులు నిర్వహించి యజమానులను అదుపులోకి తీసుకున్నారు. దీంతో పలువురు వ్యాపారస్తులు బాణాల దుకాణాలు మూసివేసి ఆందోళనకి దిగారు. అన్యాయంగా లైసెన్స్ ఉన్నా కూడా దుకాణాలపై పోలీసులు దాడులు చేస్తూ తమ వ్యాపారాలను అడ్డుకుంటున్నారని వాదనకి దిగారు. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. పోలీసు అదనపు బలగాలు వచ్చి శాంతి భద్రతలు పర్యవేక్షించారు.

గోవులను పట్టుకున్న భజరంగ్ దళ్



అక్రమంగా రవాణా చేస్తున్న గోవులు

బరంపురం: నగరానికి సమీపంలోని కుకుడాఖండి బ్లాక్ పరిధి బొడొజల గ్రామం నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న గోవుల వ్యాన్‌ను బరంపురం భజరంగ్ దళ్ ప్రతినిధులు పట్టుకున్నారు. సమాచారం అందుకున్న సదర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఐఐసీ అధికారి సంతోషిని ఒరామ్, భజరంగ్ దళ్ సభ్యులు అందించిన సమాచారం మేరకు.. కుకుడాఖండి బ్లాక్ బొడొజల గ్రామం నుంచి అక్రమంగా వ్యాన్‌లో సుమారు 15 గోవులను ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో భజరంగ్ దళ్ ప్రతినిధులు దక్షణపూర్ 59వ జాతీయ రహదారిలో మాటువేశారు. ఈలోగా జాతీయ రహదారి గుండా వస్తున్న టాటా పికప్ వ్యాన్‌ను అడ్డుకొని సోదాలు చేయగా దానిలో గోవులు కనిపించాయి. వెంటనే సదర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వ్యాన్ డ్రైవర్, క్లీనర్‌ను అరెస్టు చేశారు. గోవులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పట్టివేత



గంజాయిని తూకం వేస్తున్న పోలీసులు



గంజాయితో పట్టుబడిన నిందితుడు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల పోలీసులు శుక్రవారం బలిమెల ప్రధాన రోడ్డు వద్ద పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో చిత్రకొండ మీదుగా విశాఖపట్నం వెళ్లేందుకు ఎదురుచూస్తున్న ఒక వ్యక్తి అనుమానంగా ఉండడంతో అతని బ్యాగ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్యాగ్‌లో గంజాయిని స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేశారు. అతడిని విచారించగా తెలంగాణకు చెందిన వ్యక్తిగా నిర్ధారణ అయ్యింది. పట్టుబడిన 21 కేజీల గంజాయి విలువ సుమారు రూ.1.40 లక్షలు ఉంటుందని ఐఐసీ సుమాన్ పట్నాయిక్ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు.

సత్వర చర్యలు చేపడతాం

విషయం తెలియడంతో శ్రీమందిరం అధికార వర్గాలు ఆలయానికి చేరుకున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు వివిధ వర్గాల నియోగుల ప్రతినిధులతో సంప్రదించి చర్చలు జరపనున్నాం. సేవల నిర్వహణపై నిషేధం ఆంక్షలు ఉన్నప్పటికీ గర్భగుడిలో సేవల్లో పాల్గొనేందుకు పుష్పాలక్ సింగారి సేవాయత్ ప్రయత్నించాడు. ఇది ఆచారాలకు అంతరాయం కలిగించింది. సేవల ప్రతిష్టంభనకు దారి తీసింది. ఈ పరిస్థితి నివారించేందుకు సత్వర చర్యలు చేపట్టనున్నాం. ఈ ఘటనపై విచారణ ప్రారంభమైంది. దీనిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీమందిరం ప్రధానపాలన అధికారి (సీఏవో) రంజన్ కుమార్ దాస్



శ్రీమందిరం

స్తంభించిన నిత్య సేవాదులు

- సేవాయత్ వర్గాల మధ్య వివాదం
- మంగళ హారతి తర్వాత నిలిచిన సేవలు

భువనేశ్వర్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పూరీ జగన్నాథ స్వామివారి ఆలయం గర్భగుడిలో జరగాల్సిన నిత్య సేవాదులకు అంతరాయం ఏర్పడింది. సేవాయత్ వర్గాల మధ్య వివాదంతో శుక్రవారం ఈ పరిస్థితి నెలకొంది. గర్భాలయంలో సేవాదుల నిర్వహణ నుంచి నిషేధించబడిన పుష్పాలక్ సింగారి సేవాయత్ బలవంతంగా ప్రవేశించడంతో వివాదం బిగుసుకుని సేవాదులను ప్రభావితం చేసింది. రత్న వేదికపై వరుస క్రమంలో ఆచార వ్యవహారాలతో నిర్వహించాల్సిన సేవాదులు స్తంభించిపోయాయి. మంగళ హారతి తర్వాత నుంచి నిత్య సేవాదులు స్తంభించాయి.

☛ కులాంతర వివాహం

కులాంతర వివాహం వివాదం కారణంగా శుక్రవారం శ్రీమందిరంలో విచారకర పరిస్థితి తాండవించింది. సేవల కోసం బలవంతంగా గర్భ గుడిలోకి ప్రవేశించిన పుష్పాలక్ (సింగారి) వర్గం సేవాయత్ వేరే కులానికి చెందిన స్త్రీని వివాహం చేసుకున్నందున శ్రీ మందిరంలో కర్మలు చేయకుండా నిషేధించబడ్డాడు. ఇది నియోగుల నియమంగా అనుబంధ వర్గాలు పేర్కొన్నాయి.

☛ మహాస్నానం తర్వాతే

అధికారుల చొరవతో పరిస్థితి కొంతమేరకు శాంతియుతమైంది. స్వామి సేవలు యథాతథంగా ప్రారంభించేందుకు ఆలయం ఆచార వ్యవహారాల ప్రకారం మూల విరాటులకు మహాస్నానం చేయించిన తర్వాతే తదనంతర సేవాదులు చేయడం జరుగుతుందని తెలిపారు. నిషేధిత సేవాయత్ చొరబాటుతో చోటు చేసుకున్న అశుద్ధి నివారణకు మహాశుద్ధి ప్రక్రియ చేపట్టాలని సేవాయత్ వర్గం తెలిపింది.

స్పీకర్ ఎన్నికకు బీజేపీ దూరం



మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యే నౌరీ నాయక్

భువనేశ్వర్: ఈ ఏడాది వర్షాకాల సమావేశాలు పురస్కరించుకుని ముందుగా శాసనసభ స్పీకర్ ఎన్నికను ఈనెల 21న నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఆ తేదీన పశ్చిమ ఒడిశాలో ప్రముఖ జనపద పండగ నువాఖాయి ఉండడంతో వివాదస్పదమైంది. పండగ రోజుల్లో అంతా కలిసిమెలిసి సరదా సంతోషాలతో గడిపేందుకు సెలవు మంజూరు అవుతుంది. ఈ తరుణంలో స్పీకర్ పదవికి ఎన్నిక నిర్వహించడం అహేతుకమని కాంగ్రెసు శాసనసభ నాయకుడు నరసింగ మిశ్రా ఇటీవల ఘాటుగా స్పందించారు. ప్రభుత్వ స్పందన కొరవడడంతో తమ పార్టీ సభ్యులు ఈ ఎన్నిక నుంచి దూరంగా ఉంటారని బహిరంగంగా ప్రకటించారు. అయితే తాజాగా భారతీయ జనతా పార్టీ కూడ ఇదే ధోరణితో ముందుకు వచ్చింది. నువా ఖాయి రోజుల్లో శాసన సభ స్పీకర్ పదవికి ఎన్నిక నిర్వహిస్తున్నందున బీజేపీ సభ్యులంతా ఎన్నికకు దూరంగా ఉంటారని శుక్రవారం ప్రకటించారు. బీజేపీ ఎమ్మెల్యే నౌరీ నాయక్ మీడియా సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. శాసనసభ విపక్ష నేత, భారతీయ జనతా పార్టీ నిర్ణయం మేరకు స్పీకర్ ఎన్నికని తమ సభ్యులు బహిష్కరిస్తామని వివరించారు.

అన్నపై తమ్ముడు దాడి



అంబులెన్స్‌లో ఆరోగ్య కేంద్రానికి బ్రోజి బేట్టిని తరలిస్తున్న దృశ్యం



చికిత్స పొందుతున్న బ్రోజి బేట్టి

మల్కన్‌గిరి: అన్నపై తమ్ముడు బాణాలతో దాడి చేసిన ఘటన గురువారం కలిమెల సమితి మలావారం పంచాయతీ కుమార్‌గూడ గ్రామంలో చోటుచేసుకుంది. అన్నదమ్ముల మధ్య పొలం విషయంలో గొడవ జరిగింది. కుమార్‌గూడలో బ్రోజి బేట్టి భార్యా, పిల్లలతో నివాసం ఉంటున్నాడు. పెద్దనాన్న కుమారుడు ముత బేట్టితో పొలం వద్ద వాగ్వాదం జరిగింది. అన్నను చంపితే తనకే పొలం సొంతం అవుతుందని, తన వద్ద ఉన్న బాణాతో బ్రోజిపై ముత బెట్టి దాడి చేశాడు. బ్రోజి స్పృహ కోల్పోయి పొలం వద్దే పడిపోయాడు. అక్కడి నుంచి ముత బెట్టి పారిపోయాడు. చుట్టు పక్కల పొలాల్లో ఉన్నవారు వచ్చి బ్రోజిని కుంటుంబ సభ్యుల సాయంతో యం.వి–79 పోలీసు స్టేషన్ పరిధిలో గల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మొత్తం ఐదు బాణాలను వైద్యులు తొలగించారు. మెరుగైన వైద్య కోసం మల్కన్‌గిరి తరలిస్తామన్నారు. ఈ విషయం తెలుసుకున్న మోటు పోలీసులు ముత బేట్టిపై కేసు నమోదు చేశారు. ముత బేట్టి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

సామాన్లు దొంగిలించిన ఇద్దరు అరెస్టు





అరెస్టైన నిందితులు

జయపురం: ఇంటి ముందు నిలిచి ఉన్న ట్రక్కులో వస్తువులు దొంగలించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సదర్ పోలీసుస్టేషన్ అధికారి ఈశ్వర తండి శుక్రవారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. భరిణిపుట్ గ్రామంలోని జగన్నాథ్ కాలనీకి చెందిన బసంతకుమార్ స్వైన్ తన సొంత ట్రక్కులో కిరాణా సామన్లు లోడ్‌చేసి తీసుకొని వచ్చి, బజారుకు వెళ్లేందుకు తన ఇంటి ముందు ఈనెల 12వ తేదీ రాత్రి ఉంచారు. అయితే 13వ తేదీ ఉదయం ట్రక్కులో ఉంచిన సామాన్లు చూడగా ఎవరో దొంగతనం చేసినట్లు అనుమానించాడు. వెంటనే దాదాపు రూ.25 వేల వస్తువులు దొంగతనానికి గురైనట్లు భావించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి, గురువారం ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారు దొంగిలించిన వస్తువులను సీజ్ చేశారు. అరెస్టైనవారిలో గ్రామానికి చెందిన అభినాష్ ఖోశ్ల(22), దేవ హరిజన్(19)లు ఉన్నట్లు నిర్ధారించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.

రామకృష్ణనగర్‌లో దొంగతనం



దుండగులు చిందరవందర చేసిన బీరువా



బాధితుడు శంకరరావు

రాయగడ: స్థానిక రామకృష్ణ నగర్‌లోని ఒక ఇంటిలో శుక్రవారం చోరీ జరిగింది. ఇంటిలో గుర్తు తెలియని దుండగులు చొరబడి బీరువాను విరగ్గొట్టి రూ.50 వేల నగదు, 8 తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. దీనిపై బాధితుడు పితల శంకరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఐఐసీ కమలాకాంత్ కుహరో తెలిపిన వివరాల మేరకు.. బాధితుడు శంకరరావు కూతురుకు అనారోగ్యం కారణంగా చికిత్స నిమిత్తం గురువారం కుటుంబమంతా కలిసి విజయనగరం వెళ్లారు. ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అనంతరం శంకరరావు శుక్రవారం తెల్లవారు జామున ఇంటికి చేరుకున్నాడు. బయట తలుపులు తీసి లోపలకు వెళ్లి చూడగా ఇంటిలోని వస్తువులు చిందరవందరగా కనిపించడంతో పాటు బీరువా విరగ్గొట్టి ఉండడం గమనించారు. ఇంటి వెనుకనుంచి దుండగులు లోపలకు చొరబడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సదరు పోలీస్‌స్టేషన్‌కు కేవలం వంద మీటర్ల దూరంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆయా ప్రాంతాల్లో సీసీ కెమేరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

22 నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

- అంసెబ్లీ సమావేశాల దృష్ట్యా నిర్ణయం



ఒడిశా అసెంబ్లీ

భువనేశ్వర్: ఈనెల 22 నుంచి రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలను దృష్టిలో ఉంచుకుని కమిషనరేట్ పోలీసులు నగరంలో వాహనాల రాకపోకలపై ఆంక్షలు ప్రకటించారు. సెప్టెంబర్ 22 నుంచి ఆరంభం కానున్న శాసనసభ సమావేశాలు అక్టోబర్ 4వ తేదీ వరకు కొనసాగుతాయి. ఈ నేపథ్యంలో భద్రతా చర్యల దృష్ట్యా వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించినట్లు కమిషనరేట్ పోలీసులు తెలిపారు. సమావేశాలు ముగిసేంత వరకు ఈ ఆంక్షలు నిరవధికంగా అమల్లో కొనసాగుతాయని స్పష్టం చేశారు.

☛ వాహనాల రవాణా మార్గాల మార్పులు

హౌసింగ్ బోర్డ్ స్క్వేర్ నుంచి వచ్చే వాహనాలు కేశరి టాకీస్ స్క్వేర్ నుంచి ఎడమవైపు మళ్లించబడతాయి. ఏజీ స్క్వేర్ నుంచి పీఎంజీ వైపు వెళ్లే వాహనాలు జయదేవ్ భవన్ నుంచి కుడివైపునకు తిరిగి ఇందిరా గాంధీ పార్క్ రోడ్డు మీదుగా మళ్లించబడతాయి. మాస్టర్ క్యాంటిన్ నుంచి వాహనాలను పరిసర వీధుల గుండా లోయర్ పీఎంజీ వైపు మళ్లిస్తారు. 120 ఇన్‌ఫాంట్రీ బెటాలియన్ స్క్వేర్ నుంచి రవీంద్ర మండపం వైపు వచ్చే వాహనాలను పవర్ హౌస్ స్క్వేర్ వైపు మళ్లిస్తారు. రాజ్ భవన్ కూడలి నుంచి ఎమ్మెల్యే కాలనీ, రవీంద్ర మండపం వైపు వెళ్లే వాహనాలను శాస్త్రి నగర్ చౌరస్తా వైపు మళ్లిస్తారు. అయితే అత్యవసర సేవలు మరియు అంబులెన్స్ వాహనాలకు ఈ ఆంక్షలు వర్తించవని స్పష్టం చేశారు. అసెంబ్లీ, సచివాలయం, ఇతర అధికారిక భవనాలకు వెళ్లే అధికారం ఉన్న వాహనాలకు కూడా మినహాయింపు కల్పించారు. ఒడిశా అర్బన్ పోలీస్ చట్టం – 2003 సెక్షన్ 28 మరియు భువనేశ్వర్ – కటక్ పోలీస్ కమిషనరేట్ (ట్రాఫిక్ అండ్ పబ్లిక్ ఆర్డర్) రెగ్యులేషన్ – 2008లోని రెగ్యులేషన్ 36 ప్రకారం శాసన సభ వర్షాకాల సమావేశాల భద్రతా చర్యల దృష్ట్యా ఈ ఆంక్షలు విధించినట్లు తెలిపారు.

రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడింది

- రైతుల పరిస్థితి అధ్వానంగా ఉంది
- బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్



మాట్లాడుతున్న సామల్ పక్కనే శివపట్నాయక్, ఉలక తదితరులు

రాయగడ: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ అన్నారు. స్థానిక హోటల్ తేజస్వినీలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రకృతి వనరులు, ఖనిజ సంపదనను ఈ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేదని ఎద్దేవా చేశారు. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తూ, రైతులను మాత్రం నట్టేటా ముంచుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నీటి వనరులు మెండుగా ఉన్నప్పటికీ, సాగునీటి ప్రాజెక్టులు ఏర్పాటు చేయకపోవడంతో రైతుల పరిస్థితి అధ్వానంగా మారిందని దుమ్మెత్తిపోశారు. నవీన్ హయాంలో రైతులు వలస కూలీలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. రాయగడ జిల్లాలోని గుడారి ప్రాంతంలో పాణిడొంగొరా ఎత్తిపోతల పథకం పనులకు శిలాఫలకం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి నవీన్, పనులను మాత్రం మరిచారని ధ్వజమెత్తారు. రైతులకు రాష్ట్రంలో సకాలంలో ఎరువులు సరఫరా చేయడం లేదని, పండిన పంటను విక్రయించాలంటే నానా తంటాలు పడాల్సి వస్తోందని వాపోయారు.

☛ అసమర్థ ప్రభుత్వం

రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం గతేడాది సుమారు రూ.18 లక్షల కోట్ల నిధులు మంజూరు చేస్తే, వాటిని కూడా సరిగ్గా ఖర్చు చేయలేని ప్రభుత్వం బీజేడీ ప్రభుత్వమని మండిపడ్డారు. కేంద్రం ఇచ్చిన నిధులను సక్రమంగా ఖర్చు చేయగలిగితే రాష్ట్రం ఆర్థిక, సామాజిక రంగాల్లో ఎంతో పురోగతి సాధించేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి పాలన ఎప్పుడో మాయమయ్యిందని, కేవలం బ్యూరోక్రాట్స్ పాలన కొనసాగుతోందని ధ్వజమెత్తారు.

☛ ప్రజలు మార్పు కోరుతున్నారు

బీజేడీ పాలనపై విసిగెత్తిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారని సామల్ వివరించారు. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పర్యటించిన తాను అక్కడి ప్రజల మనోభావాలను తెలుసుకున్నానని అన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేడీకి తిలోదకాలు పలికే రోజులు ఆసన్నమయ్యాయని వెల్లడించారు.

☛ ఈనెల 17న విశ్వకర్మ పథకం ప్రారంభం

రాష్ట్రంలో ప్రజల సంక్షేమం దృష్ట్యా ఈనెల 17వ తేదీన రాష్ట్రంలో విశ్వకర్మ పథకాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని సామల్ వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల్లో భాగంగా ఇదో పథకమని అన్నారు. ఈ పథకంలో అర్హులుగా గుర్తించిన వడ్రంగులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ఈ పథకం ఎంతగానో సహాయపడుతుందన్నారు. ఈ పథకం అమలుకు రంగం సిద్ధమయ్యిందని తెలియజేశారు.

☛ బీజేపీ విజయం తథ్యం

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమని సామల్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల ఆశీర్వాదంతో ఈసారి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్నారు. ఆ భయంతోనే బీజేడీ ప్రభుత్వం రాష్ట్రంలో జరగాల్సిన విద్యార్థి సంఘం ఎన్నికలను ఈసారి కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. ఎన్నికలంటే బీజేడీ ప్రభుత్వం భయపడుతోందని ఎద్దేవా చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, ఎస్సీ, ఎస్టీ మోర్చ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు కాశీరాం మాఝి, సీనియర్ నాయకుడు బసంత కుమార్ ఉలక తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో తల్లిదండ్రులు

- ప్రాథమిక ఉపాధ్యాయుల సమ్మె
- బోధిస్తున్న పూర్వ విద్యార్థులు



జయపురం: డీఈవో కార్యాలయం ఎదుట వర్షంలో ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రాథమిక ఉపాధ్యాయుల సమ్మె శుక్రవారం నాటికి ఐదో రోజుకు చేరుకుంది. దీంతో రాష్ట్రంలోని 50,000 ప్రాథమిక పాఠశాలల్లో విద్యా బోధన వ్యవహారాలు, అనుబంధ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. ఉపాధ్యాయుల సమ్మెతో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ మసకబారి పోతుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంట చేసే పోటు కార్మికులు, పూర్వ విద్యార్థులు తరగతులు తీసుకుని విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ప్రాథమిక ఉపాధ్యాయులు ఈనెల 11న సామూహిక సెలవు ఆందోళనకు దిగారు. దీంతో విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు వచ్చి, వారి తరగతి గదుల్లో ఆడుకుంటూ, మధ్యాహ్న భోజనం తిన్న తర్వాత ఇంటికి వెళ్తున్నారు. ఇదిలా ఉండగా ఉపాధ్యాయులు లేకపోవడంతో రాష్ట్రంలోని పలు పాఠశాలలు మూతబడ్డాయి. కాంట్రాక్టు నియామకాల రద్దు, సర్వీసుల క్రమబద్ధీకరణ, జీతాల పెంపు వంటి మూడు ప్రధాన అంశాల డిమాండ్‌లను ప్రభుత్వం అంగీకరించేంత వరకు తమ ఆందోళనను విరమించబోమని ఒడిశా ప్రైమరీ టీచర్స్ ఫెడరేషన్‌లోని 1.3 లక్షల మంది సభ్యులు పునరుద్ఘాటించారు.

క్లుప్తంగా

నల్ల బ్యాడ్జీలతో నిరసన



ఆందోళన చేపడుతున్న కానిస్టేబుల్స్

పర్లాకిమిడి: స్థానిక ఉప కారాగారములో పనిచేస్తున్న నాల్గో తరగతి ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన వ్యక్తం తెలిపారు. ఉప కారాగారములో పనిచేస్తున్న కానిస్టేబుల్స్ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతున్నారు. కారాగారము కానిస్టేబుల్స్‌కు గ్రేడ్‌పే రూ.1,900లు నుంచి రూ.2,000లు, ఆహార భృతి వంటి పలు డిమాండ్లు ఇవ్వాలని కోరుతున్నారు. ఈనెల 13 నుంచి 24వ తేదీ వరకు ఆందోళనలో పాల్గొంటామని కారాగార ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.రమేష్ రోణో తెలిపారు. ఆందోళనలో ఉద్యోగులు రంజన్ కుమార్ మహంతి, సంతోష్ కుమార్ శెఠి, కె.రమేష్ రెడ్డి, ఎస్.నాగరాజు, ఎన్.చిరంజీవి, బవురి బోంధు శెట్టి పాల్గొన్నారు.

ఏబీరోడ్డులో ట్రాఫిక్‌జామ్

భామిని: ఏబీ రోడ్డులో శుక్రవారం భామిని మండలం దిమ్మిడిజోల వద్ద రోడ్డుకు అడ్డంగా దిగబడిన భారీ తారాస్ (లారీ)తో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగాయి. గురువారం రాత్రి కొత్తూరు వైపు నుంచి భామిని వస్తున్న తారాస్ వర్షం కారణంగా ఒడిశా వెళ్లకుండా వెనుదిరగాలనే ఉద్దేశంతో సైడ్‌కు తీయగా తారాస్ వెనుక భాగం రోడ్డుపక్క పొలాల్లో దిగబడి రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. స్థానికుల సహయంతో జేసీబీలతో రాత్రంతా ప్రయత్నించినప్పటికీ ఫలితం కనిపించలేదు. బత్తిలి ఎస్సై యతిరాజుల అమ్మాన్ రావు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం ఉదయం ట్రాఫిక్‌ను తొలగించి రెండువైపులా రాకపోకలకు అవకాశం కల్పించారు.

మినీ వ్యాన్ బోల్తా



వంతెనపై బోల్తా పడిన మినీవ్యాన్

భోగాపురం: స్థానిక జాతీయ రహదారి వంతెనపై మినీ వ్యాన్ శుక్రవారం ఉదయం బోల్తా పడింది. మండలంలోని మహారాజుపేట గ్రామం నుంచి ఇటుకల లోడుతో రామచంద్రపేట గ్రామానికి వెళ్తుండగా జాతీయరహదారిలో వంతెనపైకి చేరుకునేసరికి వ్యాన్ టైర్ పంక్చర్ అవడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ కోనర రమణ, వ్యాన్‌లో ఉన్న మరోవ్యక్తి మోపాడ ఈశ్వరరావు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా జేసీబీ సహాయంతో వ్యాన్‌ను పక్కకు తీశారు.

అలరించిన గాత్ర కచేరీ

విజయనగరం టౌన్: పట్టణంలోని రోటరీ దళిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీలో భారతరత్న ఎంఎస్.సుబ్బలక్ష్మి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన గాత్రకచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. ఐర్లాండ్‌కు చెందిన వంక శృతిరవళి తన గాత్రంతో అలరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ధవళ సర్వేశ్వరరావు సుబ్బలక్ష్మి గొప్పతనాన్ని వివరించారు.

చికిత్స పొందుతూ ఆర్ఐ మృతి

విజయనగరం క్రైమ్: సాలూరు మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ విజయనగరంలోని ఆర్అండ్‌బీ రైతు బజార్ సమీపంలో నివాసం ఉంటున్న త్రిపురాన రమేష్ (59) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఇటీవల భార్య అనారోగ్యానికి గురవడంతో మనస్తాపం చెందిన ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను గమనించిన కుటుంబసభ్యులు, స్థానికులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

గాజుల అలంకరణలో దాడితల్లి



ప్రత్యేకాలంకరణలో దాడితల్లి

బొబ్బిలి: స్థానిక గొల్లపల్లిలో కొలువైన దాడితల్లిని గాజులతో శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారి ని భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.



బరంపురం జ్యోతినగర్‌లో వరద నీటిలో ఇబ్బందులు



వరద ముప్పులో బోయిరాణి గ్రామం



వరద నీటిలో చిక్కుకున్న కవిసూర్య నగర్

వీడని వాన..!

- పెరిగిన వరద ముప్పు
- పోటెత్తుతున్న నదులు, చెరువులు
- జల దిగ్బంధంలో వందలాది గ్రామాలు



వరద నీటిలో చిక్కుకున్న గజపతినగర్



సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్న అస్కా ప్రజలు



గంజాం దగ్గర ప్రమాద స్థితిలో ప్రవహిస్తున్న రుసికుల్యా నది



వరద నీటిలో చిక్కుకున్న పురుషోత్తంపూర్

బరంపురం:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు గంజాం, కొందమాల్ జిల్లాలను అతలాకుతలం చేస్తున్నాయి. జిల్లాలోని బాహుదా, గడహడా, భగువా, బడ, రుసికుల్యా నదులు ఉగ్రరూపంతో ప్రవహిస్తుండడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద నీరుచేరి పురుషోత్తపూర్, బోయిరాని, బంజనగర్, సురడా, అస్కా, కవిసూర్యనగర్, ఛత్రపూర్, గంజాం, కోదలా, కల్లికోట్, హింజిలికాట్ మరియు జగన్నాథ్ ప్రసాద్ సమితి పరిధుల్లో గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. అదే విధంగా కొందమాల్ జిల్లాలో బగ్గువ, వైతరిణి నదుల్లో వరద నీరు పోటెత్తడంతో కటింగియా, గజలబడి, తిరుబడి, శ్రీరామ్‌పూర్, రైకియా, జి.ఉదయగిరి, బల్లిగుడా బ్లాక్ పరిధుల్లో వందలాది గ్రామాలకు వరద నీరు చేరింది. పలు గ్రామాలకు వెళ్లే రహదారులు కొట్టుకుపోవడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

సురక్షిత ప్రాంతాలకు తరలింపు

గంజాం జిల్లా కలెక్టర్ దివ్యజ్యోతి పరిడ స్వయంగా వరద ప్రాంతాలను సందర్శించి బాధితులకు కావాల్సిన సహాయక చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల్లో చిక్కుకున్న బాధిత గ్రామాల ప్రజలను ఓడ్రాఫ్ బృందాల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బాధితులకు అటుకులు, బెల్లం, బిస్కెట్లు అందజేశారు. తహసీల్దార్లు, బీడీవో, రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

వరద ముప్పులో బరంపురం

విపరీతంగ కురుస్తున్న వర్షాలతో బరంపురం ఏరులా మారింది. నగరానికి ఇరువైపులా ఉన్నటువంటి నదుల నుంచి వరద నీరు గజపతి నగర్, అల్కపూరి కాలనీ, శాస్త్రీనగర్, అంబపువా, జ్యోతి నగర్, లుచ్చపడా, నిమ్మఖండి, అందపసర, మీనాక్షి నగర్, శక్తి నగర్, బ్యాంక్ కాలనీలను ముంచెత్తింది. దీంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది.

ప్రఫుల్ల సామంతరాయ్‌పై సీబీఐ విచారణ జరగాలి

- ప్రజలను మోసగించి రూ.కోట్లు సంపాదిస్తున్నాడు
- పీసీసీ సాధారణ కార్యదర్శి దుర్గా పండ



మాట్లాడుతున్న దుర్గా పండ, వేదికపై అంగద్ నాయక్ తదితరులు

రాయగడ: సమాజ సేవకుడు ప్రఫుల్ల సామంతరాయ్ ఆస్తులపై సీబీఐ విచారణ జరపాలని పీసీసీ సాధారణ కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండ డిమాండ్ చేశారు. జిల్లాలోని కాసీపూర్‌లో ఉన్న దుర్గా మండపంలో పార్టీ నాయకులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి సమితిలోని అమాయక ప్రజలను మోసగిస్తూ సామంతరాయ్ రూ.కోట్లు సంపాదిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనైనా కొత్తగా పరిశ్రమలు నెలకొల్పితే అక్కడికి వెళ్లి ప్రజలను పర్యావరణం పేరుతో రెచ్చగొడుతుంటారని మండిపడ్డారు. అమాయక ప్రజలను అడ్డుపెట్టుకొని కర్మాగారాల యాజమాన్యాలు, కాంట్రాక్టర్ల నుంచి కోట్లు సంపాదించుకోవడం అలవాటుగా మారిందన్నారు. అతనిపై విచారణ జరిగేల ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

జిల్లాలోని కాసీపూర్ సమితిలో బాక్సైట్ నిక్షేపాలను తవ్వేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేదాంత్ అనే కంపెనీకి ఇటీవల అనుమతులు ఇచ్చిందని పేర్కొన్నారు. దీంతో సమితిలోని కుచేయిపాదొరొ, కుటురుమాలి, సిజారిమాలి తదితర ప్రాంతాలకు అధికారులు వెళ్తే అక్కడి ప్రజలను సామంతరాయ్, ఆయన అనుచరుడు నరేంద్ర మహంతి, అగ్రగామి అనే స్వచ్ఛంద సేవాసంస్థ అధినేత అచ్యుత్ దాస్ వంటివారు రెచ్చగొట్టి ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. ఇటువంటి వారి కార్యకలాపాలను అడ్డుకోవాలని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగాన్ని కోరారు. 1995వ సంవత్సరంలో కాసీపూర్ సమితిలో ఉత్కళ అల్యూమిన కర్మాగారం ఏర్పాటు సన్నాహాలు జరుగుతున్న సమయంలో ప్రఫుల్ల సామంతరాయ్ ప్రజలను ఇదేవిధంగా తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రజలకు, జిల్లా పోలీసు యంత్రాంగాని మధ్య జరిగిన ఘర్షణలో, కాల్పులు జరగగా ముగ్గురు అమాయక ఆదివాసీలు తూటాలకు బలయ్యారని గుర్తు చేశారు. అటువంటి పరిస్థితి మళ్లీ ఈ ప్రాంతంలో రాకుండా అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సామంతరాయ్‌ని అడ్డుకుంటాం

అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న ప్రఫుల్ల సామంతరాయ్‌ను సమితిలో పర్యటిస్తే అడ్డుకుంటామని సమితి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అంగద్ నాయక్ అన్నారు. త్వరలో తామంతా ఏకమై ఒక సమావేశాన్ని నిర్వహించి ఈ మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. తమ ప్రాంతంలో ఉన్న ఖనిజ వనరులు సద్వినియోగమైతేనే తమ ఆర్థిక, సామాజిక పరిస్థితులు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కొత్త పరిశ్రమలు ఏర్పాటైతే ప్రజల స్థితిగతులు మారతాయని, స్వార్థపరుల మాటలు విని ప్రజలు మోసపోకూడదని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమితి మాజీ చైర్మన్ ఉజాలాడి మాఝి, రాజేంద్ర దురియా, కాంగ్రెస్ కిషాన్ సెల్ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు పి.దేవేంద్రకుమార్ రావు, సేవాదళ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు అనిల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్ర

జయపురం: మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షుడు సత్యనారాయణ మిశ్ర అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో చట్టాలపై అవగాహన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. పనిచేసే ప్రదేశాల్లో వేధింపులు నివారించేందుకు ఉన్నటువంటి చట్టాలను వివరించారు. కార్యక్రమంలో ఫ్యామిలీ కోర్టు జడ్జి పవిత్ర మోహన సామల్, మహిళా కోర్టు జడ్జి అంజలి, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి సుమన్ జెన, పండ, జయపురం ప్రథమ శ్రేణి విచారపతి ఆదర్శ కుమార్ బెహర తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీలో ఘనంగా ఇంజినీరింగ్ డే



జ్యోతిప్రజ్వలన కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీకుమార్

విజయనగరం అర్బన్: భారతరత్న మోక్ష గుండం విశ్వేశ్వరయ్య 163వ జయంతిని పురస్కరించుకుని స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విజయనరం (జీవీ) యూనివర్సిటీలో గురువారం ఇంజినీరింగ్ డేను ఘనంగా జరుపుకున్నారు. కళాశాల ప్రాంగణంలో తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఇంజినీర్లు ప్రొఫెషనల్‌గానే కాకుండా సోషల్ యాక్టివిటీస్‌లో కూడా పాల్గొనాలని సూచించారు. ఎన్నో అద్భుత ప్రాజెక్టుల నిర్మాణంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య తన వంతు సేవలందించి దేశాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ (నీటిపారుదల శాఖ) ఐఎస్ఎన్‌రాజు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో సివిల్ ఇంజినీర్ల పాత్ర చాలా కీలకమని మెరుగైన ఆలోచనల ఆ్వరా మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ముఖ్యఅతిథులను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ స్వామినాయుడు సత్కరించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.గురునాథ, వివిధ విభాగాల అధిపతులు విద్యార్థులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరిలో ఎంపీ సోడాంగి పర్యటన



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ప్రజలకు అభివాదం చేస్తున్న అప్రజిత్ సోడాంగి

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో భువనేశ్వర్ ఎంపీ అప్రజిత్ సోడాంగి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమెకు స్థానిక భైరవ మందిరం వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అక్కడ నుంచి ర్యాలీగా డీఎన్‌కే క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇక్కడ ఉన్నటువంటి 7 సమితుల్లో వ్యవసాయానికి సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంటుందని మండిపడ్డారు. జిల్లాలో గిరిజనులకు సరైన ఉపాధి లేకపోవడంతో కూలీలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి ఎమ్మెల్యే ఆదిత్య మాడీ తదితరులు పాల్గొన్నారు.

పరిపాలన సామర్థ్యాల పెంపుకోసం శిక్షణ

విజయనగరం రూరల్: గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పరిపాలనలో సామర్థ్యాలను పెంపొందించడానికే రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ జె.మురళి పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పరిషత్ కార్యాలయంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పంచాయతీ కార్యదర్శుల రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామ స్థాయి ప్రభుత్వాలకు సారథ్యం వహిస్తున్న కార్యదర్శులు తమకున్న అధికారంతో ప్రజోపయోగమైన పనులు చేయాలని సూచించారు. గ్రామ కంఠం భూముల్లో నివాసం ఉన్న ప్రజల ఇళ్లకు హక్కు కల్పించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న స్వామిత్వ కార్యక్రమంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పంచాయతీల్లో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ ఆస్తులను పంచాయతీ కార్యదర్శులే కాపాడాలని హితవు పలికారు. విధి నిర్వహణలో ఒత్తిడిని జయించాలంటే మానసిక ప్రశాంతత పొందడానికి ధ్యానం చక్కని సాధనమని సూచించారు.

ఓజోన్‌తోనే భావితరాల బతుకు..!

- తగ్గుతున్న అడవులతో పొంచిఉన్న ప్రమాదం
- విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
- పెరుగుతున్న వాయు కాలుష్యం
- నేడు ఓజోన్ దినోత్సవం





రాజాంలోని ఓ పొలంలోకి మురుగునీటితో వచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలు

రాజాం: ఓజోన్ పేరు విననివారు ఎవరూ ఉండరు. మానవాళికి మాస్క్‌లా కాపాడుతూ వస్తోంది ఓజోన్ పొర. సూర్యుని అతి నీలలోహిత సూర్యకిరణాలు భూమి మీద పడకుండా కాపాడుతూ జీవజాతిని అభివృద్ధి చేస్తోంది. మానవాళిని కాపాడుతున్న ఓజోన్ పొరను మాత్రం కాపాడలేకపోతున్నాం. ఇప్పటికే రెండు చోట్ల ఓజోన్‌పొర విచ్ఛిన్నమై ప్రమాదఘంటికలు సూచించింది. అయినప్పటికీ మానవాళి మనుగడలో మార్పురాక వాయు, శబ్ద, జల కాలుష్యాలతో వాతావరణాన్ని అసమతుల్యత చేసి ఓజోన్‌కు నష్టం కలిగిస్తున్నారు. విచ్చలవిడిగా అడవులు నరికివేయడం, నదీజలాలను కలుషితం చేయడం, పంటపొలాల్లో రసాయన ఎరువుల వినియోగంతో పర్యావరణ అసమతుల్యత వస్తోంది. నేడు ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

అంతరించిపోతున్న అడవులు..

ఓజోన్ పొరకు అత్యంత అవసరమైన పచ్చని అడవులు అక్రమంగా కోతకు గురవుతున్నాయి. విజయనగరం జిల్లాలో పదేళ్లక్రితం 1,11,978 హెక్టార్లలో అటవీప్రాంతం ఉండేది. ప్రస్తుతం 90 హెక్టార్లకు తగ్గిపోయింది. అత్యధికంగా కొండ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో అనధికారికంగా చెట్లు నరికివేయడం, బ్లాక్ మార్కెట్‌కు తరలించడంతో సమస్య ఏర్పడింది. ఎక్కడికక్కడే విచ్చలవిడిగా టింబర్ డిపోలు ఉండడంతో అక్రమ కలప వ్యాపారం పెరిగి, విలువైన అటవీసంపద కనుమరుగవుతోంది.

నదీతీరాల్లో వ్యర్థాలు

జిల్లాలో నాగావళి, గోస్తని, సువర్ణముఖి, చంపావతి, వేగావతి, గోముఖి నదులు ఉన్నాయి. అపారమైన జలవనరులు ఉన్న ఈ ప్రాంతాల్లో నదీతీరాల్లో వ్యర్థ జలాలు, కలుషిత ఆహార పదార్థాలు, పశుకళేబరాలు, రసాయనాలు విడిచిపెడుతున్నారు. ప్లాస్టిక్ సంచులు, బాటిల్స్ నదుల్లో పారవేస్తున్నారు. ఫలితంగా నదీజలాలు కలుషితమవుతున్నాయి.

విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం..

జిల్లాలో ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. ప్లాస్టిక్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదు. అనుమతులు లేకుండా ప్లాస్టిక్‌ను వినియోగించడమే కాకుండా జనావాసాల మధ్య వాటిని దగ్ధం చేస్తూ వాతావరణ కాలుష్యం తెచ్చిపెడుతున్నారు.

జోజోన్ పొరను ఇలా కాపాడాలి

ఓజోన్ పొరను దెబ్బతీసే పదార్థాల వాడకాన్ని గణనీయంగా తగ్గించుకోవాలి.

- రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలి.
- పెట్రోలియం ఉత్పత్తుల వాడకం తగ్గించుకోవాలి. వీలైనంతగా ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలి. పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలతో నడిచే వాహనాల నుంచి వెలువడే పొగ ఓజోన్ పొరను దెబ్బతీస్తుంది.
- ఏసీలు, రిఫ్రిజిరేటర్లలో ఏవైనా లీకేజీలు ఉన్నాయా..అన్నది తరచూ పరీక్షించుకోవాలి. రిఫ్రిజిరేటర్ వెనుక భాగానికి గాలి తగిలేలా ఉంచడం, ఫ్రీజర్ బాక్స్‌లో తగినంత ఉష్ణోగ్రత ఉండేలా, ఉపయోగంలో లేనప్పుడు ఆఫ్ చేయడం చేయాలి.

మొక్కలు నాటాలి



పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోంది. ప్రధానంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించింది. ప్రతి చోటా మొక్కలునాటే కార్యక్రమం చేపడుతోంది. ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. భావితరాలు సురక్షితంగా ఉండాలంటే ఓజోన్‌పొరను కాపాడుకోవాలి. పర్యావరణ పరిరక్షణ ద్వారా మాత్రమే అది సాధ్యం.

దీటీవీ కృష్ణారావు, మున్సిపల్ కమిషనర్, రాజాం

అందరిదీ బాధ్యత...



ఓజోన్ పరిరక్షణ అందరి బాధ్యత. ప్రధానంగా అడవులను పెంచాలి. నదీజలాలు కలుషితం కాకుండా కాపాడుకోవాలి. ప్లాస్టిక్ వ్యర్థాలు దగ్ధం చేయకుండా చూడాలి. ధ్వని కాలుష్యాన్ని నియంత్రించాలి. మొక్కలు నాటాలి. నీటి కాలుష్యాన్ని తగ్గించాలి.

జి.భాగ్యలక్ష్మి, ఎన్విరాన్‌మెంట్ ఏఈ, రాజాం

క్లుప్తంగా

సహకార సంఘం జిల్లా అధ్యక్షునిగా రాపాక చిన్నారావు



ఈడీ సూర్యం చేతులమీదుగా నియామక పత్రాలు అందుకుంటున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో పాడి సంపదను పెంపొందించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పి.సూర్యం అన్నారు. శ్రీకాకుళం నగరంలో పశుసంవర్ధకశాఖ జేడి కార్యాలయంలో శుక్రవారం జిల్లా గొర్రెలు, మేకలు పెంపకందార్ల సహకార సంఘాన్ని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు వారికి నియామక పత్రాలను ఈడీ అందించారు. సంఘ నూతన జిల్లా అధ్యక్షుడిగా రాపాక చిన్నారావు, డైరెక్టర్లుగా బూర పాపారావు యాదవ్, పైసాకి అప్పలస్వామి యాదవ్‌లను నియమించి పత్రాలు అందించారు. సమావేశంలో పశుసంవర్ధకశాఖ అధికారులు, వంజరాపు కసవయ్య, చిన్ని జోగారావు, గద్దిబోయిన కృష్ణయాదవ్, గండబోయిన లక్ష్మణరావు, రేగాన తిరుపతిరావు, కోరాడ ధన్‌రాజ్, పాలిన కృష్ణారావు, కొల్లి తేజేశ్వరరావుతో పాటు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు వెల్లడించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఎన్‌డీటీసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి మాట్లాడుతూ ఆడ పిల్లలు, మగ పిల్ల నిష్పత్తి సమానంగా ఉండేలా సభ్యులు తమ సూచనలు తెలియజేయాలని కోరారు. అదనపు ఎస్పీ తిప్పేస్వామి మాట్లాడుతూ ప్రతి స్కానింగ్ సెంటర్‌లో ఒక రిజిస్టర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. లింగ నిర్ధారణ చట్టంపై ప్రజలను అవగాహన పరిచేందుకు సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనూరాధ మాట్లాడుతూ బోర్డర్‌లోని స్కానింగ్ కేంద్రాల్లో బ్రోకర్ల ద్వారా లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు తెలుస్తోందన్నారు. రిటైర్డ్ జడ్జి పి.జగన్నాథం మాట్లాడుతూ అందరూ బాధ్యతగా పనిచేస్తున్నారని అభినందించారు. సమావేశంలో డీసీహెచ్ భాస్కరరావు, డాక్టర్ అనూరాధ, ఆర్‌బీఎస్‌కే సీపీ శ్రీదేవి, హెల్త్ ఎడ్యుకేటర్లు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

'ఒకే రోజు ఐదు మెడికల్ కాలేజీల ప్రారంభం చరిత్ర'

అరసవల్లి: రాష్ట్రంలో ఒకేసారి ఐదు చోట్ల ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రారంభించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని ఏపీ ప్రభుత్వ డాక్టర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.శ్యామ్‌సుందర్ శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర చరిత్రలోనే కాదు, దేశ చరిత్రలోనూ ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏకంగా 17 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు అడుగులు వేస్తూ సీఎం నిర్ణయించడం సాహసోపేతమని కొనియాడారు. ఈ నిర్ణయంతో ఎందరో వైద్య విద్యార్థులు సేవకు సిద్ధమవుతారని, అలాగే మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసిన ప్రాంతాలన్నీ అభివృద్ధి చెందుతాయని తెలియజేశారు.

నదిలో మునిగి రైతు మృతి



మృతదేహం వద్ద బారువ ఎస్‌ఐ చిరంజీవి

సోంపేట: మండలంలోని పాత్రకొండ గ్రామానికి చెందిన తెంబూరు రంగారావు (52) అనే రైతు మహేంద్ర తనయ నదిలో మునిగి మృతి చెందాడు. స్థానిక పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 14వ తేదీ గురువారం మధ్యాహ్నం రంగారావు గ్రామానికి సమీపంలోని నదిలో స్నానానికి వెళ్లాడు. తిరిగి ఎంత సేపయినా ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. శుక్రవారం ఉదయం నదిలో మృతదేహం లభ్యమైంది. భార్య సరోజిని ఫిర్యాదు మేరకు బారువ ఎస్‌ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

నేడు బొల్లినేనిలో జాబ్‌మేళా

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో గల బొల్లినేని మెడిస్కిల్స్‌లో ఫార్మాస్యూటికల్ కంపెనీ ఫైజర్ విశాఖపట్నం ఆధ్వర్యంలో మహిళా అభ్యర్థులకు శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022-23 సంవత్సరంలో ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, లేదా బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులు 18-20 ఏళ్ల వయస్సు కలిగిన మహిళా అభ్యర్థులు ఈ జాబ్‌కు అర్హులన్నారు. రూ.12,500 వేతనంతో పాటు ఉచిత హాస్టల్, వసతి, రవాణా సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 7680940062, 7680945357 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చవితి ఉత్సవం..

అనుమతి కచ్చితం



లక్ష్మీగణపతి ఆలయం వద్ద సిద్ధమవుతున్న మండపం

శ్రీకాకుళం కల్చరల్: ఊరూరా ఉత్సవ ఉత్సాహం కనిపిస్తోంది. వినాయక చవితి దగ్గర పడుతుండడంతో వీధివీధినా మండపాలు ఏర్పాటవుతున్నాయి. అయితే చవితి ఉత్సవం కోసం వేసే మండపాలకు, మైక్‌సెట్లకు పలు అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే విద్యుత్ అలంకరణలు కూడా ఇష్టానుసారం చేయకుండా ఆదా చేసుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

నిబంధనలు ఇవే..

- వినాయక మండపాలు ఏర్పాటు చేసే వారు ఎక్కడ ఏర్పాటు చేస్తారో ఆ స్థలం యజమాని, మున్సిపాలిటీ, పంచాయతీ వారి అనుమతి తీసుకోవాలి.
- లిఖిత పూర్వక అనుమతి ఉన్న వాటికి మాత్రమే మైక్ సెట్ పర్మిషన్ ఇస్తారు.
- పర్మిషన్ కోసం ఈ సేవా కేంద్రంలో చలానా కట్టాలి.
- మైక్ సెట్ అనుమతికి రోజుకు రూ.100లు కడితే పోలీసు అనుమతి వస్తుంది.
- మండపం వద్ద సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేస్తే దానికి రోజుకు రూ. 500లు చలానా కట్టాలి.
- పర్మిషన్‌ను ఆ స్థలం ఉన్న ఏరియా పరిధిలోగల పోలీసు స్టేషన్‌లో తీసుకోవాలి.
- అలాగే రోజువారీ కార్యక్రమాలను సంబంధిత స్టేషన్‌లో తెలియజేయాలి.
- కార్యక్రమం శాంతియుత వాతావరణంలో జరగాలి. ప్రజలకు ఇబ్బంది కరంగా నిర్వహించ కూడదు.
- మైక్ సౌండ్ 30 మీటర్ల/యార్డ్స్ మించి ఉండ కూడదు.
- బాక్సు టైప్ స్పీకర్లు మాత్రమే ఉపయోగించాలి. హారన్ మైకులు ఉపయోగించకూడదు.
- ఎక్కువ స్పీకర్లు వాడకూడదు.
- సాంస్కృతిక కార్యక్రమాల్లో రికార్డింగు డ్యాన్సులు పెట్టకూడదు.
- మైక్ ఉదయం 9గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారు.
- బాణసంచా కాల్చకూడదు.
- ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలి.
- ఏ పోలీసు అధికారి వచ్చి అడిగినా అనుమతి కాగితం చూపించాలి.
- విద్యుత్ వినియోగానికి సంబంధించి ఆ శాఖ అనుమతి తీసుకోవాలి.
- ఇందుకోసం డిపాజిట్ కూడా కట్టాల్సి ఉంటుంది.
- కిలో వాట్ వినియోగానికి రూ.2420 డీడీ ముందస్తుగా తీసుకోవాలి.

విద్యుత్ ఆదా చేయండి

వినాయక చవితి ఉత్సవాల్లో అందరూ తమ తాహతకు తగ్గట్టుగా విద్యుత్ అలంకరణలు చేస్తారు. అయితే విద్యుత్ ఖర్చు తగ్గించుకునేందుకు పలు మార్గాలు ఉన్నాయి. వీటిని పాటిస్తే తక్కువ ఖర్చుతోనే ఆడంబరంగా సంబరం జరుపుకోవచ్చు.

- సాధారణ బల్బుల కంటే ఎల్‌ఈడీ బల్బులు వాడాలి.
- జీఎస్ఎల్ ల్యాంప్స్ కూడా వాడొచ్చు.
- జనరేటర్ కూడా వాడుకోవచ్చు. దాని ఖర్చు రోజుకు ఆయిల్, అద్దెతో కలుపుకొని రూ.8వేలు మాత్రమే అవుతుంది. విద్యుత్ శాఖ ద్వారా అయితే దాని ఖర్చు రూ.13వేలు అవుతుంది.

'పూర్తి వివరాలు తెలియజేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: అధికారుల దృష్టికి ఏవైనా సమస్యలు నివేదించినప్పుడు పూర్తి వివరాలు తెలియజేయాలని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ అంటరానితనంపై జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు వై.విశ్వమోహన్ రెడ్డి మాట్లాడుతూ గత సమావేశంలోని అంశాలను సభ్యులకు పంపినట్లు తెలిపారు. కమిటీ సభ్యులు బోసు మన్మథరావు మాట్లాడుతూ మాదిగలకు సంబంధించి కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలని కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ స్టేట్ కమిటీ నుంచి సంబంధిత ఫారాలతో పంపాలన్నారు. అంపోలు గ్రామం వద్ద ఎస్సీలకు పట్టాలు పంపిణీ చేయాలని కె.వేణు చెప్పగా ఎవరికైనా గృహాలు కావాలంటే జగనన్న కాలనీలలో దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామని జేసీ చెప్పారు. సభ్యులు చిరంజీవి మాట్లాడుతూ టెక్కలి మండలంలో భూముల విషయమై చెప్పగా భూములకు సంబంధించి విచారణ చేస్తామని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లలో పరిశుభ్రత సరిగా లేదని సభ్యులు చిరంజీవి చెప్పగా శానిటేషన్ సరిగా ఉండేలా చూడాలని ఉప సంచాలకులను జేసీ ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, అదనపు ఎస్పీ తిప్పేస్వామి, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు వై. విశ్వమోహన్ రెడ్డి, ఆర్డీవోలు సీతారామమూర్తి, బి.శాంతి, ఏపీపీ ఎం. మల్లేశ్వరరావు, డీఎస్పీ డి.విజయ్ కుమార్, టెక్కలి డీఎస్పీలు డి.బాలచంద్రారెడ్డి, కమిటీ సభ్యులు ఆర్. రామారావు, బోసు మన్మథరావు, కె. వేణు, వెలుగు అసోసియేషన్, వి.సంజీవరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి



గిరిజన సమస్యలు వింటున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సారవకోట: మండలంలో గిరిజన గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి తెలిపారు. మండలంలోని బొంతు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శుక్రవారం నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో గిరిజనుల సమస్యలపై ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల గిరిజనులు తమ సమస్యలను విన్నించారు. తాగునీరు, రహదారులు, విద్యుత్ సౌకర్యం, పోడు వ్యవసాయం చేసుకుంటున్న భూములకు పట్టాలు, కమ్యూనిటీ భవన నిర్మాణాలు చేపట్టాలని పీఓ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై పీఓ స్పందిస్తూ జిల్లాలో మొదటి సారిగా ఓ ఎమ్మెల్యే ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడంపై సంతోషం వ్యక్తం చేశారు. తమ పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇది వరకు ఉన్న శ్రీకాకుళం జిల్లాలో ఉన్న గిరిజన మండలాలన్నీ సీతంపేట ఐటీడీఏ పరిధిలోకే వస్తాయని, దీనిపై పలువురు అపోహ పడుతున్నారని ఆమె తెలిపారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనాభివృద్ధికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుని దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పోలాకి, సారవకోట జెడ్పీటీసీలు ధర్మాన కృష్ణ చైతన్య, వరుదు నాగేశ్వరి, ఎంపీడీఓ ఆర్ రాంబాబు, తహసీల్దార్ హనుమంతరావు, ఐసీడీఎస్ పీఓ కామాక్షి, ఏపీఓ గోవిందరాజులు, వైఎస్సార్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వైఎస్సార్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మూలపేట పోర్టుకు ప్రత్యేక స్థానం



దేవునల్తాడ సభలో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు: పలాస అభివృద్ధికి బ్రాండ్‌గా నిలిచిందని, రూ.700 కోట్లతో శుద్ధజల పథకం, రూ.50 కోట్లతో 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కిడ్నీ రీసెర్చ్‌సెంటర్, దాదాపు మరో రూ.70 కోట్లతో ఉద్దానం గ్రామాలను కలుపుతూ ప్రధాన రహదారుల నిర్మాణంతో అభివృద్ధికి పెద్దపీట వేశామని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని దేవునల్తాడ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సర్పంచ్ టి.వరదరాజు, ఎంపీటీసీ సభ్యుడు ఎస్. వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తన సొంత గ్రామం దేవునల్తాడలో ఏ ఒక్కరికి ఎలాంటి కష్టం వచ్చిన తాను క్షణాల్లో వాలిపోతానని అన్నారు. సీసీ రహదారులు, విశ్రాంతి భవనాలు, సామాజిక భవనాలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలోనే మూలపేట పోర్టుకు ప్రత్యేక స్థానం ఉందని, ఇందుకు సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. భావనపాడు ఫిషింగ్ హార్బర్ పనులు కూడా చేపడతామని, డ్రెడ్జింగ్ చేపట్టి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తామని అన్నారు. మూలపేట పోర్టు పూర్తి కాగానే ఈ ప్రాంతంలోని డిగ్రీ చదువుకున్న యువతకు పెద్ద మొత్తంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. గత ప్రభుత్వాలు ఇవన్నీ హామీలుగా ఇచ్చి కాలయాపన చేస్తే వైఎస్ జగన్ సర్కారు పనులు చేస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా దేవునల్తాడలో ఆయన రూ.17.50 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్య నాయుడు, నియోజకవర్గ బూత్ కన్వీనర్ సీదిరి చిరంజీవి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు యు.ఉదయ్ కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎస్.కుమార్, ఎంపీడీఓ సీహెచ్. ఈశ్వరమ్మ, తహసీల్దార్ బి. అప్పలస్వామి, ఉప సర్పంచ్ గాలి చిన్నయ్య, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పీవీ సతీష్, గ్రామ పెద్దలు బి.రామారావు పిల్లా, అంబటి సత్యరాజు, గాలి శేషగిరిరావు, గాలి షణ్ముఖరావు, క్లస్టర్ ఇన్‌చార్జి దున్న బాలరాజు, ఎ.గోపి, చింత హేమారావు, సర్పంచ్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు డిగ్రీ కాలేజీలో ఆర్‌జేడీ విచారణ



నాన్ టీచింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న జోన్-1 ఆర్‌జేడీ ఎస్.శోభారాణి

పొందూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డి.రామారావుపై వచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం ఉన్నత విద్యాశాఖ విశాఖపట్టణం జోన్-1 ఆర్‌జేడీ ఎస్.శోభారాణి విచారణ జరిపారు. ఇటీవల విద్యార్థులు ఉన్నతాధికారులతో పాటు స్పీకర్ తమ్మినేని సీతారాంకు లిఖిత పూర్వ కంగా ఫిర్యాదు చేశారు. ఫీజుల విషయంలో వేధి స్తున్నారని, ప్రిన్సిపాల్ సక్రమంగా కళాశాలకు రావటం లేదని, తరగతులు సరిగ్గా జరగడం లేదని, విద్యార్థినులకు ఎలాంటి సదుపాయాలు లేవ ని వారు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆర్‌జేడీ అధ్యాపకులు, నాన్‌టీచింగ్ సిబ్బంది, విద్యార్థులను వేర్వేరుగా విచారించారు. ప్రశ్నాపత్రాలను ఇచ్చి లిఖిత పూర్వకంగా సమాధానాలు తీసుకున్నారు. విచారణ నివేదికలు ఉన్నతాధికారులకు అందిస్తానని ఆర్‌జేడీ శోభారాణి తెలిపారు.

జూనియర్ కాలేజీలో..

అనంతరం ఆమె జూనియర్ కాలేజీని పరిశీలించారు. ఒకే ప్రాంగణంలో ఉన్న కళాశాలలు షిఫ్టు విధానంలో నడపడంపై డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.రామారావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌మనోహర్‌తో చర్చించారు. ఒకే సమయంలో డిగ్రీ, జూనియర్ కళాశాలలను నడుపుతుండటంతో తరగతి గదుల కొరతతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇంటర్ విద్య ఆర్‌జేడీతో ఫోన్‌లో మాట్లాడి షిఫ్ట్ విధానానికి అనుమతివ్వాలని కోరారు. షిఫ్ట్ విధానంలో నడిపేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వర్సిటీలో ఇంజినీరింగ్ దినోత్సవం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఘనంగా ఇంజినీర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, రిజస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.


టీమ్ వర్క్‌తోనే సత్ఫలితాలు

అరసవల్లి: ఏ రంగంలోనైనా జట్టుగా పనిచేస్తేనే ఫలితాలు సాధ్యమవుతాయని, పంచాయతీ కార్యదర్శులు ఈ దిశగా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ జె.మురళి సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల రీఫ్రెషర్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచన లు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 24 రోజుల శిక్షణలో భాగంగా.. స్థానిక జిల్లాలో శుక్రవారం శిక్షణలో 5వ రోజు సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత విధి నిర్వహణ, టీమ్ వర్కు, ఎస్‌డీజీ గోల్స్, వ్యక్తిగత ప్రవర్తన, మనఃపూర్వక యోగా తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణబాబు, డీఎల్‌పీఓ గోపిబాల తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణపై అప్రమత్తత అవసరం

ఎచ్చెర్ల క్యాంపస్: వ్యర్థాల నిర్వహణపై అప్రమత్తత అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు అన్నారు. అరిణాంఅక్కివలసలోని నాగార్జునా అగ్రికెం పరిశ్రమలో శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ, వ్యర్థాలు నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిశ్రమల నుంచి బయో, రసాయన, రేడియో వ్యర్థాలు విడుదలవుతాయని, సురక్షితంగా నిర్వీర్యం చేయటం, వీటి నుంచి స్థానికులకు, స్థానిక పరిసరాలకు, సిబ్బందికి ఇబ్బంది లేకుండా చర్యలు అవసరంగా చెప్పారు.

• వంశధార తగ్గుముఖం



గొట్టా బ్యారేజీ వద్ద దిగువకు విడిచి పెడుతున్న నీరు

వంశధార గొట్టా బ్యారేజీ వద్ద నీటి ప్రవాహం తగ్గుముఖం పడుతోంది. గురువారం ఉదయం నుంచి 70వేల క్యూసెక్కులకు పైగా వరద నీరు ఇన్‌ఫ్లో రాగా శుక్రవారం సాయంత్రానికి 29,800 క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుతం బ్యారేజీలో 37.55 మీటర్ల నీటి మట్టం ఉంది. వచ్చిన నీటిని 14 గేట్లు పైకి ఎత్తి దిగువ నదిలోకి 27,052 క్యూసెక్కులు విడిచిపెట్టారు. కుడి ప్రధాన కాలువ ద్వారా 299 క్యూసెక్కులు, ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1164 క్యూసెక్కుల నీటి పంపిస్తున్నట్లు డీఈ వై.అనిల్ కుమార్ తెలిపారు.

–హిరమండలం

యువ ఇంజినీర్లే కీలకం



ఆటోమేటిక్ సోలార్ వీడిరియల్ పరిశోధన చేస్తున్న ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న జేసీ నవీన్‌కుమార్

టెక్కలి: మారుతున్న కాలంతో పాటు సరికొత్త సాంకేతిక ఆవిష్కరణల్లో యువ ఇంజినీర్లే కీలకంగా వ్యవహరించాలని జేసీ ఎం.నవీన్‌కుమార్ ఆకాంక్షించారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఇంజినీర్స్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో గల ఇంజినీర్స్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులు అర్పించారు. నేటి తరం యువ ఇంజినీర్లు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు చేపట్టిన ఆటోమేటిక్ సోలార్ వీడిరియల్ పరిశోధనకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంపై అభినందనలు తెలిపారు. అలాగే కోడింగ్ యాక్‌థాన్ అంశంపై నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు జేసీ నవీన్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం జేసీ నవీన్‌కుమార్‌ను కళాశాల యాజమాన్యం సన్మానించింది. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ పి.సుగుణాకరరావు, కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి టి.నాగరాజు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు తో పాటు పి.దినకర్, దుర్గా రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

బెంతొరియాలకు ఊరట



బెంతొరియా విద్యార్థినికి ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్‌ను అందిస్తున్న ఇచ్ఛాపురం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్

కంచిలి/కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నివసిస్తున్న బెంతొరియాలకు ఊరట లభించింది. చాలాకాలంగా ప్రభుత్వం నుంచి ఆగిపోయిన ఇంటిగ్రేటెడ్(నేటివిటీ) సర్టిఫికెట్స్‌ను ప్రభుత్వం తాజాగా పునరుద్ధరించింది. ఈ పత్రాలు జారీ చేయకపోవడం వల్ల ఆ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే విద్యాదీవెన, వసతి దీవెన లాంటి సంక్షేమ పథకాలు కూడా అందలేదు. ఇక 45 ఏళ్లు నిండిన మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున అందించే వైఎస్సార్ చేయూత పథకానికి కూడా అర్హత సాధించలేకపోయారు. వైఎస్సార్ చేయూతకు సంబంధించి స్పెషల్ జీఓ విడుదల చేయాల్సి వచ్చేది. రెండేళ్లుగా ఈ సమస్య పరిష్కారానికి వీరు నిరీక్షిస్తున్నారు. చివరికి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అక్కడి నుంచి సీఎం స్పెషల్ పీఎస్ ధనుంజయరెడ్డి ఆధ్వర్యంలో సచివాలయాల ద్వారా జారీ చేసే ఈ సర్టిఫికెట్స్‌కు సంబంధించి ఏర్ప డిన సాంకేతిక సమస్యల్ని పరిష్కరించారు. సర్టిఫికెట్లు జారీ చేయాలని కలెక్టర్ నుంచి తహసీల్దార్లకు ఆదేశాలు వచ్చాయి. దీంతో విద్యార్థులకు మళ్లీ ధ్రువపత్రాల అందజేతను పునరుద్ధరించారు. కవిటి మండలం బల్లిపుట్టుగ గ్రామంలో గల సాయిరాజ్ నివాసంలో శుక్రవారం ఈ సర్టిఫికెట్‌ను బెంతొరియా ప్రతినిధుల సమక్షంలో విడుదల చేశారు. దీంతో మొత్తం 1437 మంది విద్యార్థులకు మేలు జరగనుంది.

బెంతొరియాల హర్షం..

ఇంటిగ్రేటెడ్ పత్రాలను మళ్లీ అందించడంపై సాయిరాజ్‌ను ఆ సంఘ ప్రతినిధులు శుక్రవారం కలిసి అభినందించారు. బెంతొరియాల వెన్నంటే ఉంటూ తమ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుండటంపై ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బెంతొరియా సంఘ అధ్యక్షుడు శ్యాంసుందర్ పురియా, ఉపాధ్యక్షులు నీలంబర్ బిసాయి, మోహన్‌సాహు, సెక్రటరీ శివ బిసాయి, ట్రెజరర్ గంగాధర్‌సాహు, మాజీ ఎఎంసి వైస్ చైర్మన్ రజని కుమార్ దొలాయి, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజ్ సాహు, మోహన్‌కుమార్ మజ్జి, బిసాయి బృందావన్, సంతోష్ కుమార్ సాహు, రాజేష్‌కుమార్ దొలాయి, జయరాం సాహు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు పక్కాగా పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్, ఎస్పీ జీఆర్ రాధిక తదితరులు

- టెక్కలిలో 'జగనన్నకు చెబుదాం'కు 66 వినతులు

టెక్కలి: ప్రతి సోమవారం మండల స్థాయిలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంతో పాటు ప్రతీ నెలా జిల్లా అధికారుల సమక్షంలో ఒక్కో మండలంలో ఆయా ప్రాంతాల ప్రజల వినతులను తక్షణమే పరిష్కరించేందుకు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. టెక్కలి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు ఎస్పీ జీఆర్ రాధిక, జేసీ ఎం.నవీన్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, టెక్కలి ఇన్‌చార్జి ఆర్డీఓ టి.సీతారామ్మూర్తి, డ్వామా పీడీ చిట్టిరాజు, జెడ్పీ సీఈఓ వెంకటరమణ, డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, హౌసింగ్ పీడీ ఎన్.గణపతిరావు, వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ టీఎస్.ప్రసాద్, డీఎస్పీ బాలచంద్రారెడ్డి, స్థానిక తహసీల్దారు కె.ప్రవల్లిక ప్రియ, ఎంపీపీ ఎ.సరోజనమ్మ, ఎంపీడీఓ హెచ్. వి.రమణమూర్తితోపాటు వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మొత్తం 66 వినతులు అందాయి.

- మూలపేట పోర్టు అప్రోచ్ రోడ్డుకు భూములిచ్చిన తలగాం ప్రాంతం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన హనుమంతు వెంకటేశ్వరరావు విన్నవించారు.
- టెక్కలి మండలం గిరిజన గ్రామం భీంపురం ప్రాంతానికి బస్సు పునరుద్ధరించడంతో పాటు రహదారిని మరమ్మతులు చేయాలని, జీడిపేటలో గెడ్డపై వంతెన నిర్మాణం చేయాలని గ్రామానికి చెందిన జపాన్, చంద్రరావు, కామన్న తదితరులు విన్నవించారు.
- టెక్కలి ఎన్‌టీఆర్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని డి.శ్రీనివాస్ విన్నవించారు. అలాగే రోటరీనగర్, వెంకటేశ్వర కాలనీ, బాలాజీనగర్ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు మంజూరు చేయాలని డి.పోలయ్య విన్నవించారు.
- టెక్కలి మండలం పితాపురం గ్రామానికి వంతెన నిర్మాణం చేయాలని గ్రామస్తులు విన్నవించారు. పట్టణంలో పలువురు పేదలకు హుద్‌హుద్ ఇళ్లు మంజూరు చేయాలని, అలాగే అంజనాపురం జగనన్న లేఅవుట్‌కు రోడ్డు వేయాలని డి.రాజ్‌కుమార్ కోరారు.
- లింగాలవలస ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయాలని పాపారావు, ఎ.జోగారావు, హెచ్. మోహన్‌రావు కోరారు. టెక్కలి మండలం జయకృష్ణాపురం లో మంచినీటి కుళాయిలు వేయాలని ఎస్. రాజశేఖర్ విన్నవించారు.
- టెక్కలి చిన్నబ్రాహ్మణవీధిలో తనకు చెందిన భూమిని ఆక్రమించే వారి పై చర్యలు తీసుకోవాలని మహాపాత్రో విన్నవించారు.
- టెక్కలిలో విశ్వ బ్రాహ్మణులకు శ్మశాన వాటిక కోసం స్థలం మంజూరు చేయాలని, అలాగే స్థానిక ఎన్‌టీఆర్ కాలనీ సమీపంలో రజకుల వినియోగిస్తున్న చెరువులో మురుగు నీరు లేకుండా చర్యలు చేపట్టాలని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏబీ స్విచ్‌లు మరమ్మతులు చేపట్టాలని ఎంపీటీసీ వి.శ్రీధర్‌రెడ్డి కలెక్టర్‌కు విన్నవించారు.